నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I | హైదరాబాద్, బుధవారం 10 జూలై 2024 | SANGAREDDY

హుస్నాబాద్ టౌన్: హుస్నాబాద్ ప్రాథమిక పాఠశాలలో వంటచేస్తున్న స్వర్ణ మహిళాసంఘం సభ్యులు

సంక్షోభంలో సర్కారు బడి!

ప్రభుత్వ విద్య బలోపేతంపై దృష్టి సారించని కాంగ్రెస్ సర్కారు

- విద్యా సంవత్సరం ప్రారంభమైనా సమీక్షించని మంత్రులు
- సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న ప్రభుత్వ బడులు
- ఇబ్బందుల్లో మధ్యాహ్న భోజన కార్మికులు
- నెలల తరబడి అందని గౌరవ వేతనాలు
- అధ్వానంగా మిడ్‌డే మీల్స్
- నిలిచిన అల్పాహార పథకం
- ఇప్పటికీ రాని గుడ్ల డబ్బులు
- అందని రెండో జత యూనిఫామ్, నోట్‌బుక్కులు
- ఉమ్మడి మెదక్ జిల్లాలో 2,75,447 మంది విద్యార్థులు

సిద్దిపేట, జూలై 9 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): సర్కారు బడులు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. కాంగ్రెస్ సర్కారు ప్రభుత్వ బడులపై దృష్టిసారించడం లేదు. దీంతో సర్కారు విద్య నిర్వీర్యం అవుతున్నది. విద్యాసంవత్సరం ప్రారంభమై రెండునెలలు కావస్తున్నా జిల్లాకు చెందిన మంత్రులు, ఇన్‌చార్జి మంత్రి రివ్యూలు నిర్వహించడం లేదు. మధ్యాహ్నం భోజనం సరిగ్గా అమలు కావడం లేదు. ఇప్పటికీ రెండో జత యూనిఫామ్స్, అందరికీ నోట్ పుస్తకాలు అందక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు ప్రైవేట్ పాఠశాలలపై నియంత్రణ కరువైంది. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఇష్టారీతిన ఫీజులు గుంజుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. మధ్యాహ్న భోజన కార్మికులకు నెలలు తరబడి వేతనాలు రాక ఇబ్బంది పడుతున్నారు. విద్యార్థులకు పెడుతున్న గుడ్ల పైసలు రావడం లేదు. గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని పూర్తిగా రద్దు చేసింది.

సిద్దిపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు భోజనం పెడుతున్న నిర్వాహకులు

ఉమ్మడి మెదక్ జిల్లాలో...

ఉమ్మడి జిల్లాలో మెదక్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 2,75,447 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వీరికి మధ్యాహ్నం భోజనం వడ్డించడానికి కార్మికులను ప్రభుత్వం నియమించింది. 25 మంది లోపు విద్యార్థులు ఉంటే ఒక కార్మికురాలిని, 26 మంది పైన విద్యార్థుల నుంచి 100లోపు ఉంటే ఇద్దరు కుక్ కం హెల్పర్ ఉంటారు. 100 మందికి పైగా విద్యార్థులు ఉంటే అడిషనల్‌గా మరొకరు ఉంటారు. వీరికి నెలకు రూ. 3వేల చొప్పున గౌరవ వేతనం ప్రభుత్వం చెల్లిస్తున్నది. కానీ, గతేడాది డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు మధ్యాహ్న భోజన కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లించడం లేదు. దీంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2024 జనవరి, ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, జూన్‌కు సంబంధించి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. 9,10వ తరగతి మధ్యాహ్న భోజన బిల్లులు 2024 జనవరి వరకే వచ్చాయి. ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, జూన్ నెలల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.1నుంచి 8వ తరగతి వరకు బిల్లులు 2024 ఏప్రిల్ వరకే వచ్చాయి. జూన్ బిల్లులు పెండింగ్ ఉన్నాయి. ఇక ప్రతి పాఠశాలలో విద్యార్థులకు గుడ్లు పెడుతారు. ప్రతి వారంలో సోమ, బుధ, శుక్రవారాల్లో విద్యార్థులకు ఒక్కో గుడ్డు పెడుతున్నారు. ఈ బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయి. ఒక్కోగుడ్డుకు ప్రభుత్వం రూ.5 కట్టిస్తున్నది. దాదాపుగా కోడిగుడ్ల బిల్లులు 2024 జనవరి వరకే వచ్చాయి. ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ , జూన్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వేల రూపాయలు అప్పులు తెచ్చి భోజనాలు వండిపెడితే బిల్లులు రాక తమకు భారంగా మారింది మధ్యాహ్న భోజన కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇవే కాకుండా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల లేమి విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అల్పాహారం పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో పేద విద్యార్థులకు అల్పాహారం అందక ఇబ్బందికి గురవుతున్నారు.

మిరుదొడ్డి పాఠశాలలో కూరగాయలు తరుగుతున్న కార్మికురాలు పద్మ, విద్యార్థులకు ఆహారం సిద్ధం చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

రాష్ట్రం వాటా పైసలు రావట్లే..

మిరుదొడ్డి, జూలై 9: ఉమ్మడి మిరుదొడ్డి మండలంలో 22 ప్రాథమిక, 3 అప్పర్ ప్రైమర్ స్కూల్స్, 13 జడ్పీ పాఠశాలలు కలిపి మొత్తం 38 ఉన్నాయి. వీటిలో 3503 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 38 పాఠశాలల్లో 82 మంది మధ్యాహ్న భోజన కార్మికులు విధులు నిర్వహింస్తున్నారు. ప్రతిరోజు మధ్యాహ్నం భోజనం వండిపెడుతున్నారు. వీరికి రూ.3 వేల చొప్పున గౌరవ వేతనం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్నవి. అందులో రూ. వెయ్యి రూపాయలు కేంద్ర ప్రభుత్వం తన వాటా బ్యాంకుల్లో జమ చేసింది. కానీ, రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన మిగతా రూ.2 వేల చొప్పున గౌరవ వేతనం ఇప్పటికీ వేయలేదు.మిరుదొడ్డి మండలంలో 82 మంది మధ్యాహ్న భోజన కార్మికులకు కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం రూ.8.20 లక్షలు చెల్లించాల్సి ఉందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. కోడిగుడ్ల డబ్బులు మొత్తం రూ.12 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉందని గోడు వెళ్లబోసుకుంటున్నారు. సర్వశిక్షా అభియాన్, ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్ (ఐఈఆర్‌పీ) నెల వేతనం 11 మందికి కలిసి రూ.3 లక్షల వరకు రావాల్సి ఉంది.

బిల్లులు రావు..వంట ఎట్ల వండాలె..

- నాలుగు నెలలుగా అందని మధ్యాహ్న భోజన బిల్లులు
- ఐదు నెలలుగా రాని గౌరవ వేతనం
- ఇబ్బందుల్లో కుక్, హెల్పర్, మధ్యాహ్న భోజన కార్మికులు
- మెదక్ జిల్లాలో 871 ప్రభుత్వ పాఠశాలలు

రామాయంపేట పాఠశాలలో బియ్యంలో మెరిగెలు తీసివేస్తున్న కార్మికులు

మెదక్, జూలై 9 (నమస్తే తెలంగాణ): మెదక్ జిల్లాలో 871 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో ప్రాథమిక పాఠశాలలు 607, యూపీఎస్ 124, జడ్పీ హైస్కూళ్లు 140 ఉన్నాయి. 65,610 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరికి మధ్యాహ్న భోజన కార్మికులు ప్రతిరోజు మధ్యాహ్న భోజన పథకం కింద భోజనాన్ని మెనూ ప్రకారం అందిస్తున్నారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులకు పెండింగ్ వేతనం, బిల్లులు, గుడ్ల బిల్లులు రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 5 నెలల నుంచి కుక్ కం హెల్పర్‌కు చెల్లించే రూ.3 వేల గౌరవ వేతనం 6 నెలలకు సంబంధించిన వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. 5 నెలల నుంచి మధ్యాహ్న భోజన కార్మికులకు చెల్లించాల్సిన బిల్లులు సైతం పెండింగ్‌లో ఉన్నాయి. నెలల తరబడి బిల్లులు రాకపోవడంతో అప్పులు చేసి భోజనం వండిపెడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10వేల వేతనం అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. తక్షణమే బిల్లులు చెల్లించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


నర్సాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో గతంలో బ్రేక్ ఫాస్ట్ పెడుతున్న హెల్పర్

అటకెక్కిన సీఎం అల్పాహారం పథకం

నర్సాపూర్, జూలై 9 : బీఆర్ఎస్ హయాంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అల్పాహారంలో భాగంగా పూరి, ఇడ్లీ, ఉప్మా పెట్టేవారు. నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని జగన్నాథరావు కాలనీలోని ప్రభుత్వ పాఠశాల, రోష్నీ ఉర్దూ మీడియం ప్రభుత్వ పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు శివంపేట్ మండలం చిన్నగొట్టిముక్కల ఉన్నత, ప్రైమరీ పాఠశాలల్లో బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని అమలు చేశారు. విద్యార్థులు ఉదయం ఇంటినుంచి వచ్చి పాఠశాలల్లో పెట్టే అల్పాహారం తిని చక్కగా చదువుకునేవారు. ప్రస్తుతం కాం6గెస్ సర్కారు అల్పాహారం పథకాన్ని రద్దుచేయడంతో విద్యార్థులు ఆకలితో అలమటిస్తున్నారు. పునఃప్రారంభించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఉదయం కండ్లు తిరుగుతున్నాయి..

ఉదయం ఏమి తినకుండా ఇంటి నుంచి పాఠశాలకు వస్తే కండ్లు తిరిగి పడిపోతున్నాం. ఇంట్లో తిని వద్దామంటే సమయం సరిపోవడం లేదు. గతంలో పాఠశాలలో టిఫిన్ పెట్టడం మంచిగా ఉండేది. ప్రస్తుతం టిఫిన్ పెట్టడం ఆపేశారు. ఉదయం ఏమి తినకపోవడంతో ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. మళ్లీ బ్రేక్‌ఫాస్ట్ పెట్టాలి.

– సంజన, పదోతరగతి, నర్సాపూర్

ఇంట్లో తినకున్నా భరోసా ఉండేది..

గతంలో ఇంట్లో ఏమి తినకుండా పాఠశాలకు వచ్చినా పాఠశాలలో టిఫిన్ పెడతారనే భరోసా ఉండేది. ఇప్పుడు పాఠశాలలో బ్రేక్‌ఫాస్ట్ ఆపివేయడంతో ఇబ్బందిగా ఉంది. గతంలో బ్రేక్‌ఫాస్ట్ పెట్టిన మాదిరిగా ఇప్పుడు కూడా పెట్టాలని ప్రభుత్వాన్ని కోరుతున్నా.

–అనూష, పదో తరగతి, నర్సాపూర్

పాఠశాలలకు ఉచిత కరెంట్ ఊసేలేదు

జిన్నారం: నల్తూరు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల

జిన్నారం, జూలై 9 : ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత కరెంట్ ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించినా ఇప్పటికీ అమలు కావడం లేదు. ఉచిత కరెంట్ సరఫరాపై మండల విద్యాశాఖ అధికారులను, ఉపాధ్యాయులను ఆరాతీస్తే దీనిపై ఎలాంటి ఆదేశాలు రాలేవన్నారు. కుక్ కం హెల్పర్‌లకు రావాల్సిన గౌరవ వేతనం గురించి ఆరా తీస్తే మూడు నుంచి నాలుగు, ఐదు నెలలకు ఒక సారి బడ్జెట్ రిలీజ్ చేస్తారని, బడ్జెట్ రిలీజ్ అయిన తరువాతనే కుక్ కం హెల్పర్లకు గౌరవ వేతనాలు చెల్లిస్తామన్నారు. ఉపాధ్యాయుల ప్రమోషన్ల నేపథ్యంలో ఖాళీ అయిన స్థానాల్లో వలంటీర్లను నియమించినట్లు తెలిపారు. అంగన్‌వాడీ సెంటర్లకు గుడ్ల సరఫరా చేస్తున్న వారికి బిల్లులు అందుతున్నాయా అని ఆరాతీస్తే, గుడ్లు వస్తున్నాయా లేదా అనేది మాత్రమే తాము చూస్తామని, బిల్లుల చెల్లింపు జిల్లా అధికారుల నుంచి జరుగుతుందని తెలిపారు.

అప్పులు చేస్తూ అవస్థలు పడుతున్నాం..

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం బిల్లులను వెంటనే విడుదల చేయాలి. డబ్బులు సకాలంలో రాకా బయట అప్పులు చేస్తూ చాలా అవస్థలు పడుతున్నం. ప్రభుత్వం బిల్లులు విడుదల చేసి మమ్మల్ని ఆదుకోవాలి.

– బోనగిరి లక్ష్మి, మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు, బెజ్జంకి

పాల బిల్లులు చెల్లించాలి

ములుగు, జూలై 9:పాల బిల్లులు చెల్లించడం లేదంటూ విజయ డెయిరీ పాల విక్రయదారులు మంగళవారం ఆందోళన చేపట్టారు. సిద్దిపేట డిల్లా ములుగులోని విజయ డెయిరీలో పాలను విక్రయిస్తున్న రైతులకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 15 రోజులకో సారి బిల్లులు చెల్లించే వారని, ఇప్పుడు 6 నెలలు గడుస్తున్నా పాల బిల్లులు చెల్లించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తాము పశుపోషణకు, కుటుంబ అవసరాలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. వెంటనే పాల బిల్లులను చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు.

ములుగులో పాల డబ్బాలతో నిరసన తెలుపుతున్న విక్రయదారులు

మాడల్ స్కూల్‌లో ఫుడ్ పాయిజన్

- 35 మంది విద్యార్థినులకు అస్వస్థత
- అల్పాహారంలో బల్లి పడ్డట్లుగా అనుమానం
- రామాయంపేట బల్దియా పరిధిలోని కోమటిపల్లిలో ఘటన
- పరామర్శించిన అధికారులు, మాజీ ఎమ్మెల్యే

మెదక్ జిల్లా రామాయంపేటలోని ప్రభుత్వ దవాఖానలో విద్యార్థినులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే హన్మంతరావు

రామాయంపేట,జూలై 9: మెదక్ జిల్లా రామాయంపేట బల్దియా పరిధిలోని కోమటిపల్లి తెలంగాణ మాడల్ స్కూల్‌లో మంగళవారం ఫుడ్ పాయిజన్ జరిగి విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. వివరాలు.. కోమటిపల్లిలోని తెలంగాణ మాడల్ స్కూల్ కళాశాలలో మంగళవారం ఉదయం అల్పాహారం తిని 35 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. వసతి గృహం సిబ్బంది వారిని హుటాహుటిన రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స అందించారు. 32 మంది విద్యార్థినులకు వైద్యం అందించిన తర్వాత కోలుకోవడంతో హాస్టల్‌కు తరలించారు. మరో ముగ్గురు విద్యార్థినులను దవాఖానలో ఉంచి మెరుగైన వైద్యం అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు దవాఖానకు చేరుకుని విద్యార్థినులను పరామర్శించి ధైర్యం చెప్పారు. డీఈవో రాధాకిషన్, ఉప వైద్యాధికారి అనిల, మెదక్ ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్ రజినీకుమారి, వైద్యురాలు హరిప్రియ, ప్రదీప్, సుకేషిని దవాఖానలో విద్యార్థినులను పరామర్శించారు. ఘటనపై డీఈవో రాధాకిషన్ స్పందించారు. విద్యార్థినులు అల్పాహారం భుజించి అస్వస్థతకు గురైన మాట వాస్తవమేనని, విద్యార్థినులకు ప్రభుత్వ దవాఖానలో మెరుగైన వైద్యం అందించినట్లు తెలిపారు. అల్పాహారంలో బల్లి పడ్డట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నామన్నారు.

ప్రభుత్వ దవాఖానలో విద్యార్థినులను పరామర్శిస్తున్న అధికారులు

పోయిన తాప కోడిగుడ్ల పైసలు రాలేదు..

హుస్నాబాద్ టౌన్, జూలై 9: మాది స్వర్ణ మహిళా సంఘం. పోయిన తాప కోడిగుడ్ల పైసలు ఇప్పటికీ ఇయ్యలేదు. ఇప్పుడు టమాట 80, మిర్చి 120 రూపాయలు.. కూరగాయలు... ఉప్పు, పప్పుల ధర బాగా పెరిగినయి. ఇది హుస్నాబాద్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన మధ్యాహ్న భోజన నిర్వాహకులు సావుల పద్మ, సరిత, జ్యోతి ఆవేదన. ఈ పాఠశాల ప్రారంభంలో 135మంది విద్యార్థులు ఉండగా.. తాజాగా మరో 50మందికి పైగా విద్యార్థులు చేరారు. ఈ పాఠశాలలో మధ్యాహ్న భోజనం నిర్వహిస్తున్న వారి కష్టాలు వర్ణణాతీతం.. ప్రభుత్వం వీరికి చెల్లించే ధరలకు మార్కెట్‌లో ఉన్న ధరలకు ఎక్కడా పొంతనలేదు. పైగా ఈ సంవత్సరం కూరగాయల ధరలు సైతం విపరీతంగా మండిపోతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోయిననెల కోడిగుడ్డు ధర ఏడు రూపాయలకు ఇచ్చింర్రు.. ఇప్పుడు ఆరు రూపాయలు అంటంర్రు. మాకు సార్లు కట్టిచ్చేది ఐదు రూపాయలు.... టమాట ధర అయితే మస్తు పెరిగింది. ఏ కాయగూర కొందామన్నా రేట్లు కొనేతట్లు లేవు. ఇవన్ని ఒక్కెత్తు. మాకు పోయిన పారి పైసలే ఇంకరాలే. నెలకు యాభైవేల రూపాయలు అప్పు మా గ్రూపులోల్లం తెచ్చుకుంట ఈ చిట్టిలు కట్టుకు ఈ వంటచేసుడు చేసుకుంటున్నం. ఇండ్ల ఏమిలాభం లేకున్న ఏండ్లనుంచి సేత్తన్నం కదా అని సేసుడు అయితంది. సర్కారు మా వంట చేసేటోల్ల బాధను సూసి పైసలు పెంచి మమ్మల్ని ఆదుకోవాలే.

– సావుల పద్మ, మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు,హుస్నాబాద్

కాంగ్రెస్ పాలనలో సర్వనాశనం

హుస్నాబాద్, జూలై 9: కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సర్కారు పాఠశాలల నిర్వహణ గాడి తప్పింది. విద్యార్థులకు ఉదయం పూట ఇచ్చే సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని రద్దు చేశారు. గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులు ఇబ్బందుల పాలవుతున్నారు. ఇప్పటికి కొన్ని పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్‌లు అందలేదు. ఉపాధ్యాయులపై పర్యవేక్షణ కరువైంది. దీంతో తరగతుల నిర్వహణ సక్రమంగా లేదు. మధ్యాహ్న భోజన కార్మికులకు ఆరు నెలలుగా గౌరవ వేత నం రావడం లేదు. విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వడం లేదు. ప్రభుత్వ తీరుపై విద్యార్థులతో కలిసి ఆందోళనలు చేపడుతాం.

– సూరంపల్లి పరశురామ్, బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

నెలనెలా పైసలు ఇవ్వాలి..

ప్రతిరోజూ బడిలో చదివే విద్యార్థులకు సమయానికి అన్నం వండి పెడుతున్న మాకు టైమ్‌కు పైసలు రావడం లేదు. ప్రభుత్వం మా వేతనాలు పెండింగ్‌లో పెట్టకుండా నెలనెలా ఇవ్వాలే. అప్పులు తెచ్చి వంటలు చేస్తే మాకు పైసలు టైమ్‌కు రాక చానా ఇబ్బందులు పడుతున్నాం. తెచ్చిన అప్పులకు మిత్తీలు పోనూ మాకు ఏమి మిగులుత లేవు. మమ్మల్ని ఆదుకొని సమయానికి పైసలు అయ్యాలి.

– బుడిగె కళమ్మ, మధ్యాహ్న భోజన కార్మికురాలు, ఐనాపూర్

దుబ్బాక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో బియ్యంలో మెరిగలు, రాళ్లు ఏరివేస్తున్న వంట నిర్వాహకులు

బిల్లులు నెలనెలా ఇయ్యాలే..

సిద్దిపేట, జూలై 9: రెక్కాడితేనే డొక్కాడని బతుకులు మావి. రెండేండ్లుగా మేము మధ్యాహ్న భోజనం కార్మికులుగా పనిచేస్తున్నాం ప్రభుత్వం నెలనెలా బిల్లులు మంజూరు చేయాలి. పెంచిన వేతనాలను నెలనెలా ఇవ్వాలి. 6 నుంచి 8వ తరగతులకు మాత్రమే ఏప్రిల్ –2024వరకు బిల్లులు వచ్చాయి. 9 నుంచి 10వ తరగతి వారికి ఫిబ్రవరి నెల వరకు బిల్లులు ఇచ్చారు. మళ్లీ బిల్లులు మంజూరయ్యా అని చెప్తున్నారు. మా స్కూల్లో 200 మంది విద్యార్థులు ఉన్నారు వారికి వారంలో రెండుసార్లు కోడిగుడ్లు పెడుతున్నం. ప్రభుత్వం ఒక్కో కోడిగుడ్డుకు రూ.4 మాత్రమే ఇస్తున్నది. మేం బయట కోడిగుడ్డుకు రూ .6.50 పెట్టి కొంటున్నం. కోడిగుడ్డు రేటును పెంచాలి. ప్రభుత్వం చెప్పినట్లు మాకు జీతం నెలకు రూ.10 వేలు ఇయ్యాలే. కోడిగుడ్ల బిల్లు జనవరి వరకు మాత్రమే వచ్చాయి. వాటిని తొందరగా ఇయ్యాలి. ఇప్పుడు వస్తున్న వేతనంతో మాకు ఇల్లు గడవడం కష్టంగా ఉంది. పొద్దున్న వస్తే మధ్యాహ్నం వరకు ఇక్కడే ఉండటంతో మేము వేరే ఏ పనిచేసుకోలేక పోతున్నాం. ప్రభుత్వం మాపై దయచూపి జీతాలు పెంచాలి.

– సుగుణ, మధ్యాహ్న భోజన కార్మికురాలు, చింతమడక

కూలీ పనికి వెళ్లినా బాగుండు..

దుబ్బాక, జూలై 9 : దుబ్బాకలోని బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చాలాకాలంగా వంటచేసి పెడుతున్నాం. గ్యాస్‌స్టోవ్‌పై అన్నం సరిగ్గా ఉడకడం లేదంటే, కట్టెలు తెచ్చి వంట చేస్తున్నాం. కట్టెల మీద వంట చేయడంతో పొగతో ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయి. మా మహిళా సంఘంలో 12 మందికి మూడు నెలలకు నలుగురు సభ్యులం చొప్పున విద్యార్థుల వంటచేసి భోజనం అందిస్తున్నాం. పాఠశాలలో 250 మంది విద్యార్థులు ఉన్నారు. వారంలో మూడురోజులు కోడిగుడ్డు ఇస్తున్నాం. రోజుకు రెండురకాల కూరలు వండి పెడుతున్నాం. నెలకు లక్ష రూపాయలపైనే ఖర్చు అవుతున్నది. అప్పులు చేసి, పిల్లలకు భోజనం వండిపెడుతున్నాం. 6 నెలలుగా మాకు బిల్లులు రావడం లేదు. కిరాణా దుకాణాల్లో ఉద్దెర ఇవ్వడం లేదు. మిత్తికి డబ్బులు తెచ్చి వంటచేస్తున్నం. అన్ని లెక్కలు వేస్తే మాకు రోజుకు ఒక్కరికి రూ. 200 కూడా రావడం లేదు. కూలీ పనులకు వెళ్లినా బాగుండేది.

– తలారి లక్ష్మి, వంట నిర్వాహకురాలు, దుబ్బాక

సరుకులు తేవడానికి ఇబ్బందిగా ఉంది...

గజ్వేల్, జూలై 9: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వాహకులను పెండింగ్ బిల్లులు చెల్లించాలి. తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు సంబంధించిన బిల్లులు వెంటనే విడుదల చేయాలి. మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ప్రతినెలా బిల్లులు, గౌరవ వేతనం సకాలంలో చెల్లిస్తే బాగుంటుంది. బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో సరుకులు తేవడానికి ఇబ్బందిగా ఉంది. కిరాణా దుకాణంలో అప్పులు చేసి సరుకులు తెస్తున్నాం.

–బాషాయ్య, మధ్యాహ్న భోజన నిర్వాహకుడు, గజ్వేల్

గౌరవ వేతనాలు రావడం లేదు..

రామాయంపేట, జూలై 9: మూడు నెలలు గడుస్తున్నా మాకు గౌరవ వేతనాలు రావడం లేదు. పని చేస్తేనే మా కుటుంబాలు గడుస్తాయి. నాకొచ్చే జీతంతోనే మా కుటుంబం బతుకుతున్నది. ప్రభుత్వం సకాలంలో వేతనాలు ఇస్తే మాకు బాధలు ఉండవు. కిరాణా దుకాణంలో బకాయిలు పెరిగి పోతున్నాయి. పైసలకు ఇబ్బందిగా ఉంది. మాకు నెలనెలా పైసలు ఇవ్వాలి.

–మెక్కొండ కళావతి, వంట నిర్వాహకురాలు, రామాయంపేట

రెండేండ్లుగా స్కాలర్‌షిప్‌లు రాలే..

కోహెడ జూలై 9: కోహెడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్న. పేదవాడినైన నాకు ప్రభుత్వం స్కాలర్‌షిప్ ఇస్తుందంటే దరఖాస్తు చేసుకున్న. ఇంతవరకు రాలేదు. బీసీలు అంటే ప్రభుత్వానికి అంత నిర్లక్ష్యమా. మాకు స్కాలర్‌షిప్ వస్తే ఎంతో సహాయంగా ఉంటుంది.

–శశాంక్, ఇంటర్ విద్యార్థి, కోహెడ

స్కాలర్‌షిప్‌లు ఇచ్చి ఆదుకోవాలి

కోహెడ జూలై 9: మాకు స్కాలర్‌షిప్‌లు వస్తలేవు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకుంటే స్కాలర్‌షిప్ వస్తాయని చెప్పారు. ఆర్థికంగా టదువుకు ఆదుకుంటాయని ఆశపడితే నేటికీ మంజూరు కాలేదు. ప్రభుత్వం పేద విద్యార్థులను ఆదుకోడానికి వెంటనే స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయాలి. పేద విద్యార్థులకు ప్రభుత్వం అండగా నిలవాలి

–శ్రీజ, ఇంటర్ విద్యార్థిని, కోహెడ